

ఖమ్మం పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రజాపాలన దినోత్సవంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ సీఎం విక్రమార్క

- ప్రపంచంతో పోటీ పడుతూ ముందుకు దూసుకువెళ్తోంది
- ప్రజాపాలనతో అభివృద్ధి, సంక్షేమం ప్రజల చెంతకు...
- నాటి విముక్తి పోరులో ఖమ్మం జిల్లాది వీరోచిత పాత్ర
- నెత్తుటి త్యాగాలు చేసిన పల్లెలు...
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- ఖమ్మంలో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం
- సమరయోధుల కుటుంబాలకు స్వయంగా సత్కారం

తెలంగాణలో అభివృద్ధి వికాసం



ఖమ్మం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణలో స్వేచ్ఛ కోసం ఆనాటి సమాజం ఉద్యమించిందని, ఫలితంగానే 1948 సెప్టెంబరు 17న హైదరాబాద్ సంస్థానం రాజుల పాలన నుండి భారతదేశంలో అంతర్భాగంగా మారిందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రపంచంతో తెలంగాణ పోటీపడేలా రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందని, ఆ దిశగా అభివృద్ధి ముందుకు పోతోందని వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, నిరుద్యోగ యువతకు ఉపాధి, సాగునీరు, పారిశ్రామిక రంగాల అభివృద్ధితో పాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రాన్ని ప్రపంచంతో పోటీపడే విధంగా ప్రజాపాలన నిర్వహిస్తున్నామన్నారు.

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఖమ్మం పోలీసు పరేడ్ మైదానంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

76 ఏళ్ల క్రితం ఇదేరోజున హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణ... రాజుల పాలన నుంచి దేశంలో అంతర్భాగంగా మారి ప్రజాస్వామ్య పాలన దిశగా పరివర్తన చెందిందని, తద్వారా ప్రజాస్వామ్య స్వేచ్ఛను పొందిందని, ఇందుకు యావత్ సమాజం ఉద్యమం సాగించిందని గుర్తుచేశారు. తెలంగాణను విముక్తి చేసిన ఉద్యమంలో ఖమ్మం జిల్లా కీలక పాత్ర వహించిందని పేర్కొన్నారు. ముదిగొండ, గోకినపల్లి, వెంకటాయపాలెం , మధిర, తెల్దారుపల్లి, ఎర్రుపాలెం, రావినూతల, గోవిందాపురం ప్రాంతాలు నిత్యపోరాట క్షేత్రాలుగా నిలిచాయని, బొమ్మకంటిసత్యనారాయణ, రావెళ్లసత్యం, రావెళ్ల వెంకటరామయ్యలాంటి ఎందరో మహనీయులు సాయుధ పోరాటంలో భాగంగా నిలిచారని గుర్తు చేసుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమ ఫలాలు

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయత్వంలో ప్రజాప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన తర్వాత సెప్టెంబరు 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తోందని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందాలన్న ఉద్దేశంతో ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి దరఖాస్తులు స్వీకరించి అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లకింద ప్రతి నియోజకవర్గానికి రూ.3500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరంలో 4 లక్షల 50వేల ఇళ్లు నిర్మించబోతున్నామని ప్రకటించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ కింద హామి ఇచ్చిన మేరకు 22,22,067మందికి రూ.17,869 కోట్లు ఇప్పటికే జమ చేశామని తెలిపారు. రైతుభరోసా ద్వారా అర్హులైన రైతులకు ఎకరానికి రూ.15వేలు అందించాలన్నది ఈప్రభుత్వ సంకల్పనమని,సన్నవడ్లకు (మిగతా 4వ పేజీలో)



ప్రజాపాలన వేడుకలో మహిళలతో మాట్లాడుతున్న విక్రమార్క

- భద్రాద్రి జిల్లా అభివృద్ధికి శక్తి వంచనలేకుండా కృషి చేస్తా..
- ఆధునిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలి..
- ఆయిల్‌పామ్ సాగులో దేశంలోనే భద్రాద్రి జిల్లాకు గుర్తింపు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- కొత్తగూడెంలో ఘనంగా ప్రజాపాలన వేడుకలు



కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ప్రజాపాలన దినోత్సవంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి తుమ్మల

కాంగ్రెస్ హయాంలోనే సమగ్రాభివృద్ధి



కొత్తగూడెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్వీయ అస్తిత్వం కోసం ఉద్యమించి స్వరాష్ట్రంగా అవతరించిన తెలంగాణ.. నేడు దేశంలో అభివృద్ధి పథంలో ముందంజలో ఉందని, అందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు, నాటి హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో కలిసి 77వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా మంగళవారం కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరిగిన ప్రజా పాలన వేడుకల్లో మంత్రి తుమ్మల మాట్లాడారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నదని ఉద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికపాలనలో విద్యుత్, నీటిపారుదల, వ్యవసాయం, పరిశ్రమలు, ఉద్యోగ, ఉపాధికల్పన, అభివృద్ధి సంక్షేమపథకాలతో పాటు ఐటీ నుంచి వ్యవసాయ రంగాల వరకు అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించిందన్నారు. ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామని ఇచ్చిన హామీమేరకు అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యసేవలను రూ.10లక్షలు అమలుచేసి అంకితభావాన్ని చాటుకున్నామన్నారు. రైతు రుణమాఫీ, గృహజ్యోతి, మహాలక్ష్మీ వంటి పథకాల అమలు పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజాపాలన పేరిట అభయహస్తం గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టామన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతు రుణభారాన్ని మాఫీ చేయడంతో పాటు వ్యవసాయానికి నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను 24గంటలపాటు అందిస్తుంటంతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. రుణమాఫీ పథకం కింద జిల్లాలో 57,983మంది రైతులకు రూ.415,27,93,429 రుణమాఫీ చేసి అప్పుల బాధ నుంచి విముక్తి కలిగించిన ఘనత ప్రభుత్వానిదే అన్నారు. అన్నదాత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు వార్షిక ప్రీమియం చెల్లిస్తూ రైతు బీమా అమలు చేస్తున్నామన్నారు. అల్పాదాయ వర్గాల వారి ఇళ్లలో చిమ్మచీకట్లను పారదోలి విద్యుత్‌కాంతులు నింపేందుకు గృహజ్యోతి అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో రూ. 30 కోట్ల 33లక్షల 28వేల సబ్సిడీ ద్వారా చెల్లించామన్నారు. 6,12,384 నిరుపేదలు గృహజ్యోతి పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500కే వంట గ్యాస్ ఇస్తున్నామని జిల్లాలో 1,47,294 లబ్ధిదారులకు 3 లక్షల 52వేల సిలిండర్లు సరఫరా చేసి రూ.9.13లక్షల సబ్సిడీ చెల్లించామన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కట్టవాగు, కోడిపుంజుల వాగు ఉధృతంగా ప్రవాహించడంతో మణుగూరు ప్రాంత నీటమునిగిందన్నారు. జిల్లాలోని అంజనాపురం, ఉలువనూరులో సైతం భారీ (మిగతా 4వ పేజీలో)



ప్రజాపాలన వేడుకలో స్టాల్‌ను తిలకిస్తున్న మంత్రి తుమ్మల

నిమజ్జనం వేళ పోలీసులపై దాడి



- ఖమ్మం వన్ టౌన్ సీఐ ఉదయ్ కుడిచేతికి తీవ్ర గాయం
- గొడవ పడొద్దన్నందుకు దాడి చేశారంటున్న పోలీసులు
- ఐదుగురు యువకులపై కేసు నమోదు

ఖమ్మం క్రైం, సెప్టెంబరు 17: గణేశ్ నిమజ్జనం వేళ కొందరు యువకులు రెచ్చిపోయారు. నడిరోడ్డుపై గొడవ పడటమే కాకుండా, తమను అడ్డుకోబోయిన పోలీసులపైనా దాడికి దిగారు. ఈ సంఘటన ఖమ్మంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నగరంలో కొందరు యువకుల ఓవర్‌యాక్షన్‌కు ఈ సంఘటన అద్దం పట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం 6గంటల నుంచి ఖమ్మంలో పోలీసులు బందోబస్తు విధుల్లో వున్నారు. అర్ధరాత్రి పాత బస్‌స్టాండ్ సమీపంలో వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి విధులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఓ గణేష్ విగ్రహం వద్ద కొందరు గొడవ పడుతుండగా.. అది గమనించిన సీఐ ఉదయ్‌కుమార్ వారి వద్దకు వెళ్లి ఇక్కడ నుండి వెళ్లి పోవాలని సూచించారు. అయితే వారు వెళ్లకుండా పోలీసులతో గొడవకు దిగారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న ఐదుగురు యువకులు ఒక్కసారిగా పోలీసులపై దాడికి దిగారు. ఆపే ప్రయత్నం చేసిన సీఐని కూడా నెట్టివేశారు. దీంతో ఆయన కుడి చేతికి తీవ్రగాయమైంది. వెంటనే అక్కడున్న సిబ్బంది సీఐని ఆస్పత్రికి తరలించారు. కాగా శ్రీరాంనగర్‌కు చెందిన దోన్‌వాన్ రవీంద్ర, దోన్‌వాన్ అరుణ్, దోన్‌వాన్ అశోక్, ఎన్ఎస్టీ రోడ్డుకు చెందిన తాజునోత్ భద్రం, బుర్హాన్‌పురానికి చెందిన కొనరాజు సాయి స్వరూప్‌లతో పాటు మరికొంతమంది దాడికి పాల్పడ్డారని హెడ్ కానిస్టేబుల్ కె.సంజీవ్‌కుమార్ మంగళవారం ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమెదు చేశారు.

పోలీసుల అత్యుత్సాహం: బీజేపీ

నిమజ్జనం వేళ రోడ్డుపై ప్రసాదం తీసుకుంటున్న వారిపై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి మయూరి సెంటర్ వద్ద గణేష్ నిమజ్జనానికి వెళుతున్న కొంతమంది ప్రసాదం తింటుండగా వారిపై పోలీసులు కావాలని దాడి చేశారని, ఈ ఘటనలో కొంతమందికి గాయాలు కూడా అయ్యాయని తెలిపారు. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

భద్రాద్రిలో కొనసాగుతున్న నిమజ్జనోత్సవం



- వందలాదిగా తరలివస్తున్న వినాయక విగ్రహాలు
- రెండో రోజు గోదావరి నీటిమట్టం తగ్గడంతో ఇబ్బందులు
- గణేష్ నిమజ్జనానికి 9 గంటల పాటు ఆటంకం
- తాత్కాలిక ర్యాంప్ నిర్మించి సమస్య పరిష్కరించిన అధికారులు
- విగ్రహం పడి గజ ఈతగాడికి విరిగిన కాలు
- కొత్తగూడెంలో ఘనంగా సాగిన శోభాయాత్ర

భద్రాచలం/కొత్తగూడెం సాంస్కృతికం, సెప్టెంబరు 17: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలోని గోదావరిలో వినాయక విగ్రహాల నిమజ్జనం జోరుగా సాగుతోంది. గణపతి బప్పా మోరియా.....జై గణేష్ జై జై గణేష్.. అంటూ వందలాది మంది భక్తులు విగ్రహాలతో తరలివస్తున్నారు. సోమవారం మొదలైన నిమజ్జనోత్సవం మంగళవారం కూడా కొనసాగింది. రాష్ట్రంలోని ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, వరంగల్ తదితర ఉమ్మడి జిల్లాల నుంచి గణనాధుల విగ్రహాలను తీసుకువస్తున్నారు. వేడుకకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే మంగళవారం గోదావరి తీరాన గణేష్ నిమజ్జనానికి తొమ్మిది గంటల పాటు ఆటంకం ఏర్పడింది గోదావరి నీటిమట్టం 20 అడుగులకు తగ్గడంతో ఆ ప్రభావం గణేష్ నిమజ్జనంపై పడింది. ఇదే సమయంలో గోదావరి నిమజ్జన ఘాట్ వద్ద బురదకావడంతో క్రేన్, హైడ్రా, జేసీబీ, డోజర్లు తిరిగేందుకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మంగళవారం తెల్లవారు 2 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు భద్రాచలం గోదావరి నదీ తీరంలో గణేష్ నిమజ్జనాలు నిలిచిపోయాయి. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన విగ్రహాలను ఘాట్‌పైనే ఉంచారు. దీంతో సుమారు 400 విగ్రహాలు 11 గంటల వరకు నిమజ్జనం కాకుండా ఉండిపోయాయి.

ఈ క్రమంలో ఐటీసీ సంస్థ సహకారంతో ఫ్లయాష్, క్లింకర్ మెటీరియలన్(పీజీ)తో బురదలోనే తాత్కాలిక ర్యాంపు నిర్మించడంతో గణేష్ విగ్రహాల నిమజ్జనం పునః ప్రారంభమైంది. గణేష్ నిమజ్జనం సమయంలో జేసీబీతో తీసుకొస్తున్న గణేష్ విగ్రహం గజ ఈతగాడు రేగళ్ల రాజేష్ కాలుపై పడి కాలు విరిగింది. దీంతో వెంటనే అతన్ని భద్రాచలంలోని ప్రయివేటు (మిగతా 4వ పేజీలో)



భద్రాచలం గోదావరిలో నిమజ్జనానికి వచ్చిన విగ్రహాలు



కొత్తగూడెంలో శోభాయాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

ఎవరి దారి వారిదే..



- విభిన్న పేర్లతో 'సెప్టెంబర్ 17' వేడుకలు
- ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్..
- విమోచనం పేరుతో బీజేపీ....
- విలీనం పేరుతో సీపీఎం...
- సాయుధ పోరాట వార్షికోత్సవం పేరుతో సీపీఐ...
- విద్రోహం పేరుతో మాస్‌లైన్...

ఖమ్మం, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైన రోజును (సెప్టెంబరు 17) రాజకీయ పార్టీలు వేరువేరు పిలుపులతో వేడుకగా జరుపుకున్నాయి. ఎవరి కార్యక్రమాల్లో వారు జాతీయ జెండాలను ఎగురవేశారు. అధికార, విపక్షాలు సెప్టెంబర్ 17 విశిష్టతను చాటి చెబుతూ కార్యక్రమాలు సాగించాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ తెలంగాణా ప్రజాపాలన దినోత్సవంగా పిలుపునిచ్చి జాతీయజెండాలు ఎగురవేసింది. ఖమ్మంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కొత్తగూడెంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు జాతీయజెండాలు ఆవిష్కరించి ఘనంగా ప్రజాపాలన వేడుకలు జరిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ప్రజాపాలన దినోత్సవంగా జాతీయజెండా ఎగురవేశారు. అధికారపార్టీ నాయకులు వారి పార్టీ కార్యాలయాలతో పాటు, మండల, నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజాపాలన దినోత్సవంగా పేర్కొంటూ నాటి స్వాతంత్ర సమరయోధులను గుర్తుకు తెచ్చుకుంటూ వేడుకలు నిర్వహించారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

1948 సెప్టెంబరు 17ను విమోచన దినంగా పేర్కొంటూ భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ కార్యాలయాలతో పాటు పలుచోట్ల జాతీయజెండాలను ఆవిష్కరించి పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఖమ్మంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, గెంటేల విద్యాసాగర్‌రావు, అల్లిక అంజయ్య, శ్యామ్‌రాథోడ్ తదితరుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో...

కమ్యూనిస్టుల పార్టీల ఆధ్వర్యంలో కూడా సెప్టెంబరు 17 వేడుకలు నిర్వహించారు. సీపీఎం వారు విలీన దినోత్సవంగా బోనకల్ మండలం రావినూతలలో వేడుకలు నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు వై.విక్రమ్ ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులు అర్పించి విలీన వేడుకలు నిర్వహించారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన వారి గ్రామాల్లో సంస్మరణ సభలు నిర్వహించారు. ఇక సీపీఐ తెలంగాణ సాయుధపోరాట వార్షికోత్సవం పేరుతో వేడుకలు నిర్వహించింది. గత వారంరోజులుగా సాయుధపోరాట యోధుల గ్రామాల్లో సంస్మరణ సభలు నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు జిల్లా పార్టీ కార్యలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించగా, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పార్టీ పతాకాన్ని ఎగురవేశారు.

మాస్‌లైన్ ఆధ్వర్యంలో..

సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ విద్రోహదినం పేరుతో కార్యక్రమాలు నిర్వహించారు. సెప్టెంబరు 17 విలీనం కాదు, విమోచన కాదు ముమ్మాటికి విద్రోహదినమని ఆ పార్టీ కార్యక్రమాలు నిర్వహించింది. భూమి, భుక్తి, పేదప్రజల విముక్తికోసం జరిగిన పోరాటంలో నాలుగువేల మంది ప్రాణాలు కోల్పోయారని, ఇది విద్రోహ దినమని ఖమ్మంలోని రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గుర్రం అచ్చయ్యతో పాటు ఆవుల వేంకటేశ్వర్లు, పుల్లయ్య, రామయ్య తదితరులు అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. పలు మండల కేంద్రాల్లో విద్రోహ దినం వేడుకలు నిర్వహించారు.



కేఎంసీలో క్యూ కట్టిన మున్నేరు వరద బాధితులు

మున్నేరు వరదపోటుతో రోడ్డున పడిన బాధితుల కష్టాలు తీరడం లేదు. సర్వం కోల్పోయిన వారికి ప్రభుత్వం రూ.16,500 చొప్పున ఆర్థిక సాయం ప్రకటించింది. అయితే సర్వేలో, వివరాల కంప్యూటరీకరణలో లోపాలతో అర్హులైన వందలాది మందికి పరిహారం ఇంతవరకు అందలేదు. దీంతో వారు నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

-ఖమ్మం సంక్షేమ విభాగం

పరిహారం కోసం పరేషాన్...

- మున్నేరు వరద బాధితుల్లో ఇంకా అనేక మందికి అందని సాయం
- సర్వే, వివరాల కంప్యూటరీకరణలో చోటుచేసుకున్న తప్పిదాలే కారణం 4
- రోజూ కేఎంసీకి క్యూ కడుతున్న బాధిత జనం
- తామూ నష్టపోయామని కొత్తగా మరో 600 దరఖాస్తులు
- రెండు రోజుల్లో పరిష్కరిస్తామంటున్న ఆర్వో శ్రీనివాసరావు

పంతులు గారి వంకర బుద్ధి

- నాలుగో తరగతి బాలిక పట్ల అసభ్యకర ప్రవర్తన
- పోక్సో కేసు నమోదు.. సస్పెండ్ చేసిన డీఈవో



ములకలపల్లి, సెప్టెంబర్ 17: భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాలలో చేస్తున్న ఉపాధ్యాయుడిపై మంగళవారం ములకలపల్లి పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న బాలిక పట్ల ఉపాధ్యాయుడు టి. శ్రీనివాస్ మంగళవారం అసభ్యకరంగా ప్రవర్తించటంతో బాలిక ఈ విషయాన్ని తల్లితండ్రులకు చెప్పింది. దాంతో బాలిక తండ్రి ములకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఈ వ్యవహారం గురించి భద్రాద్రి జిల్లా విద్యాశాఖాధికారికి సమాచారం అందటంతో సదరు పాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ మంగవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

కబళిస్తున్న కాలువలు



కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

- గ్రామాలకు సమీపంలో 'సీతారామ' కెనాల్స్
- చిన్నారులకు పొంచివున్న ప్రమాదం
- తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలంటున్న అధికారులు
- రక్షణ చర్యలు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుకు డిమాండ్

సత్తుపల్లి, సెప్టెంబరు 17: గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వ్యవసాయ భూములకు మళ్లించేందుకుగానూ సీతారామ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా కాలువల తవ్వకం పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే కాలువలు తవ్వకం పూర్తైన ప్రాంతాలలో వర్షపు నీరు చేరింది. గ్రామాలకు సమీపంలో కాలువలు ఉండటంతో ఆయా కాలువల వైపు ఎవరైనా వెళితే ప్రమాదం పొంచివుందనే ఆందోళన వ్యక్తమవుతుంది.

అశ్వాపురం నుంచి అశ్వారావుపేట వరకు...

సీతారామ ప్రాజెక్టు కాలువలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం నుంచి ఖమ్మం జిల్లాలోని పలు మండలాలతో పాటు అశ్వారావుపేట మండలం వరకు పలు ప్యాకేజీలలో సీతారామ కాలువలు విస్తరిస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాలువలు అనేక గ్రామాలను ఆనుకుని తవ్వారు. కొన్ని గ్రామాలకు 200నుంచి 400మీటర్ల దూరంలోనే కాలువలు తవ్వారు.

మూడున్నర నుంచి ఐదున్నర మీటర్ల లోతు

కాలువలు లెవల్స్‌ను అనుసరించి పలు ప్రాంతాలలో కనిష్ఠంగా మూడున్నర మీటర్ల నుంచి గరిష్ఠంగా ఐదున్నర మీటర్ల లోతు తవ్వారు. కాలువల తవ్వకం నిర్మాణం కొన్ని ప్రాంతాలలో పూర్తి కాగా మరికొన్ని ప్రాంతాలలో పనులు జరుగుతున్నాయి. కాలువ తవ్వకం పూర్తి ఆయిన చోట ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద మొత్తంలో నీరు చేరింది.

అన్ని జాగ్రత్తలు అవసరం

గ్రామాలకు అత్యంత సమీపంగా తవ్విన సీతారామ కాలువలకు సంబంధించి ప్రమాదాలు జరుగకుండా ఆయా గ్రామాల ప్రజలతో పాటు అధికారులు కూడా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ప్రస్తుతం కాలువలు నిర్మాణం అసంపూర్తిగా ఉన్న సమయంలోనే నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయి. భవిష్యత్‌లో కాలువ నిర్మాణం పూర్తయి నీటి ప్రవాహం మొదలైతే కాలువల్లో పెద్ద మొత్తంలో నీరు ప్రవహించే అవకాశం ఉంది. గ్రామాలను ఆనుకుని ఉన్న కాలువలలో ముఖ్యంగా చిన్న పిల్లలు ఈతకు వెళ్లకుండా కాలువల వైపు ఆడుకునేందుకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గ్రామాలను ఆనుకుని తవ్విన కాలువలకు సంబంధించి ప్రతి గ్రామం వద్ద రక్షణ చర్యలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాలను ఆనుకుని తవ్విన సీతారామ ప్రాజెక్టు కాలువల వద్దకు చిన్నారులు వెళ్లకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రక్షణ చర్యలు శూన్యం

గ్రామాలకు అత్యంత సమీపంలో తవ్వుతున్న, తవ్విన కాలువల వద్ద ఏ రకమైన రక్షణ చర్యలు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. కాలువ తవ్వకం పూర్తయిన చోట భారీవర్షాలకు చేరిన నీటిని డీవాటరింగ్ చేయాల్సిన అవసరం ఉన్నా అలా చేయకపోవడంతో కాలువలలో భారీగా నీరు చేరింది. దీంతో సీతారామ 10వ ప్యాకేజీలోని సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామానికి అత్యంత సమీపంలో కాలువ ఉండటం, కాలువ వద్దకు ఆడుకునేందుకు వెళ్లిన పదేళ్ల వయస్సు కలిగిన జీతేంద్రకుమార్, శశాంక్ ప్రమాదవశాత్తూ కాలువలో నీటిలో మునిగి చనిపోయారు.

ప్రమాదం చోటుచేసుకున్న ప్రాంతంలో కనీసం ఎర్ర రిబ్బన్లు కట్టడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఈ దుర్ఘటన జరిగిందని గ్రామస్థులు సంఘటన జరిగిన రోజు రాత్రి ఆందోళన చేశారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న భట్టి విక్రమార్క

భూమిలేని నిరుపేదలకు ఏటా రూ.12 వేలు

- సేంద్రియ వ్యవసాయ సాగులో చింతకానికి పెద్దపీట
- సోలార్ వ్యవసాయ పంపుసెట్ల పైలెట్ ప్రాజెక్టుగా సిరిపురం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

చింతకాని, సెప్టెంబరు 17: ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ అమలులో భాగంగా భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఈ ఏడాది నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో రూ 12 వేలు జమ చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో మంగళవారం దళితబంధు రెండో విడతలో భాగంగా 847 లబ్ధిదారులకు సుమారు రూ.15 కోట్ల మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.. నిరంకుశ రాచరిక పరిపాలన నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య పరిపాలనలోకి వచ్చినందున ప్రజా ప్రభుత్వం సెప్టెంబరు 17ను ప్రజాపాలన దినోత్సవంగా ప్రకటించిందన్నారు. సెప్టెంబరు 17 దినోత్సవం విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్న పార్టీల నాయకులు ప్రజా ప్రభుత్వం ప్రకటించిన ప్రజాపాలన దినోత్సవాన్ని స్వాగతించాలని కోరారు. అనేక మంది త్యాగధనుల పోరాటాల ఫలితంగా రాచరిక పాలన నుంచి ప్రజాపాలన తెచ్చుకున్నామన్నారు. ఈ దేశానికి భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పరమ పవిత్రమని వీటిని గౌరవించే ప్రతి ఒక్కరు ప్రజాప్రభుత్వం ప్రకటించిన సెప్టెంబరు 17ను ప్రజాపాలన దినోత్సవంగా స్వాగతించి గౌరవించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టబోతున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ 6 లక్షలు, ఇతర లబ్ధిదారులకు రూ 5 లక్షలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అందజేస్తామన్నారు. సేంద్రియ ఉత్పత్తుల వైపు ప్రజలు మొగ్గుచూపుతున్నారని ఆవైపుగా రైతులు దృష్టి సారించాలన్నారు. సేంద్రియ సాగులో చింతకాని మండలానికి పెద్దపీట వేయనున్నట్లు తెలిపారు. సోలార్ వ్యవసాయ పంపుసెట్లు వినియోగం పెరగాలని అందుకు మధిర నియోజకవర్గంలో సిరిపురం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడానికి స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా ప్రభుత్వమే రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల రూపాయల వడ్డీలేని రుణాలు ఇస్తున్నామన్నారు. మధిర ప్రజలు తలెత్తుకునే విధంగా పరిపాలన కొనసాగిస్తున్నామని ప్రజా సంక్షేమం కోసం ప్రతిక్షణం అంకితాభావంతో పనిచేస్తున్నామన్నారు. మండలంలో దళితబంధు పథకంలో 3,462 కుటుంబాలు ఎంపిక చేశామన్నారు. దళితబంధు యూనిట్లను ఇతరులు కొనకూడదని బెదిరించి తీసుకునిపోవడం నేరమన్నారు. లబ్ధిదారుల నుంచి తీసుకెళ్లిన యూనిట్లను తిరిగి తీసుకువచ్చి అప్పగించాల్సిన బాధ్యత ప్రత్యే అధికారులు, జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు. అంతకు ముందు ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ నాయకులు కంభం నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎండీ ముజామిల్ ఖాన్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, డీఎఫ్‌వో సిద్దార్థ విక్రమ్‌సింగ్, ట్రైనీ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ్, జిల్లా అధికారులు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు మడిపల్లి భాస్కర్, కన్నెబోయిన గోపి, కొప్పుల గోవిందరావు, కూరపాటి కిషోర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

'కమ్యూనిస్టులపై కుట్రతోనే ఆపరేషన్ పోలో'

ఖమ్మంటౌన్,సెప్టెంబరు17: సైనికచర్య వల్ల నిజాం రాజ్యం తెలంగాణాలో విలీనం కాలేదని, ఆపరేషన్ పోలో కమ్యూనిస్టులపై కుట్రతోనే జరిగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. సాయుధపోరాట 76వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం సీపీఎం జిల్లాకార్యాలయం ఆవరణలో బాగం జాతీయ జెండాను ఆవిష్కరించగా, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పార్టీపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోటు ప్రసాద్ అధ్యక్షతను జరిగన సభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ నిజాం స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకుంటే, కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిందన్నారు. కమ్యూనిస్టుల దాటికి నిలవలేక నిజాం సైన్యం తోక ముడిస్తే, నిజాం, అప్పటి నెహ్రూప్రభుత్వం కలిసి ఒక అవగాహనకు వచ్చి కమ్యూనిస్టుల ప్రభుత్వం ఏర్పడకుండా కుట్రలు పన్ని ఆపరేషన్ పోలో నిర్వహించారని బాగం ఆరోపించారు. బీజేపీకి తెలంగాణాపై మాట్లాడే హక్కు లేదని, వారు చరిత్రను వక్రీకరించారన్నారు. ఈ సభలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి,యర్రా బాబు, ఎస్‌కే జానీమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

దానవాయిగూడెంలో ఉద్రిక్తత

- ఇళ్లలోని వస్తువులు ధ్వంసం
- వ్యక్తికి గాయాలు

ఖమ్మం క్రైం, సెప్టెంబరు17: నగరశివారు ప్రాంతం అయిన దానవాయిగూడెంలో మంగళవారం రాత్రి ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గణపతి నిమజ్జనంలో భాగంగా ఆప్రాంతానికి చెందిన రెండు వర్గాల మధ్య సోమవారం రాత్రి ఘర్షణ జరిగింది. ఈఘర్షణలో ఆప్రాంతానికి చెందిన కృష్ణ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో మంగళవారం రాత్రి మరో రెండు ఇళ్లలో కొందరు రాళ్లు వేశారు. తరువాత ఇండ్లలోకి వెళ్లి ఇండ్లలోని సామాన్లు, వస్తువులు ధ్వంసం చేశారు. స్థానికుల సమాచారం మేరకు హవేలీ పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకొని ఘర్షణ వాతావరణాన్ని అదుపులోకి తీసుకువచ్చారు. అదేవిధంగా ఆప్రాతంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాగునీరందక ఎండుతున్న పంటలు

నేలకొండపల్లి, సెప్టెంబరు17: సాగునీరందక మండల వ్యాప్తంగా పంట పొలాలు ఎండుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల క్రితం వరకు భారీ వర్షాలతో అతలాకుతలమై తీవ్ర ఇబ్బందులెదుర్కొన్న రైతులు ప్రస్తుతం సాగునీరందక ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్క రైతు ఇప్పటికే ఎకరాకు సుమారుగా రూ.25వేల వరకు పెట్టుబడి పెట్టి ఉన్నారు. ఈసమయంలో తలాపున నీళ్లుండీ ఏపుగా ఎదిగిన పంట పొలాలు ఎండుతుంటే రైతన్నల కంట కన్నీరు వస్తోంది. మొన్నటి భారీ వర్షాలకు, వరదలకు పాలేరు పాలకాల్వ, నాగార్జున సాగర్ ఎడమ కాల్వలు తెగి పోవటంతో అధికారులు సాగునీటిని నిలిపివేశారు. పనులను యుద్ధప్రాతిపదికన చేయకుండా ఆలస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అనాసాగరంలో నీళ్లు లేక ఎండిపోయిన పొలం

పామాయిల్ బోర్డును సాధిస్తాం: తాండ్ర

ఖమ్మం బైపాస్‌రోడ్, సెప్టెంబరు17: దేశంలో అన్ని రాష్ట్రాలకంటే తెలుగురాష్ట్రాల్లో పామాయిల్ సాగుకు అవకాశాలు అధికంగా ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంతో చర్చించి పామాయిల్ బోర్డును తెచ్చేందుకు కృషిచేస్తానని ఖమ్మం బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన తాండ్ర వినోదరావు మంగళవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. పామాయిల్ రైతులకు మోదీ సర్కార్ భరోసాగా ఉంటుందని, ప్రస్తుతం దిగుమతిసుంకాన్ని 5.5శాతం నుంచి 27.5శాతానికి పెంపుసాధించామని, దీంతో రెండు తెలుగురాష్ట్రాల పామాయిల్‌సాగు రైతులకు భారీ ఊరటలభిస్తుందన్నారు. ప్రధానిగా మోదీ వచ్చిన నాటినుంచి దేశంలోపామాయిల్ రైతులకుపెద్దపీట వేసిందని, 2014లో పామాయిల్ టన్ను రూ.6268 ఉండగా 2023లో రూ.14205కు ఖరారుచేశారని, అన్నిరాష్ట్రాల్లో పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు సమగ్ర విధానం ద్వారా మోదీ సర్కారు ముందుకు సాగుతుందన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సమగ్రాభివృద్ధి

(3వ పేజీ తరువాయి)

నష్టం జరిగిందన్నారు. జిల్లాలో 2144 వరద బాధిత కుటుంబాలకు బ్యాంకు ఖాతాలకు రూ.16,500ల చొప్పున జమచేశామని అన్నారు.

అనంతరం వివిధ శాఖల అధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శించి, వివరాలు తెలుసుకుని వారికి సలహాలు, సూచనలు అందించారు. ఆయిల్‌పాం ఉత్పత్తి రంగంలో రాష్ట్రంలోనే కాకుండా దేశంలో భద్రాద్రికొత్తగూడెం జిల్లా గుర్తింపు చెందడం గర్వకారణమన్నారు. కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషిచేసిన ఎన్‌సీసీ విద్యార్థుల సేవలను కొనియాడారు. వారితో కలిసి పోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారయణ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాస్, మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా కొత్తగూడెం ప్రగతిమైదానంలోని అమరవీరుల స్థూపం వద్దకు మంత్రి తుమ్మల చేరుకుని అమరవీరుల వీరులకు నివాళులు అర్పించారు.



కలెక్టర్‌తో జితేష్.వి.పాటిల్‌తో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

స్కూల్ పిల్లల ఆటోను ఢీకొట్టిన కారు

- విద్యార్థి మృతి..
- ఆటో డ్రైవర్‌తో పాటు నలుగురు విద్యార్థులకు తీవ్రగాయాలు
- భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలంలో ఘటన

ములకలపల్లి, సెప్టెంబరు17: పాఠశాలను విద్యార్థులను ఇంటికి తీసుకెళుతున్న ఆటోను ఓ కారు ఢీకొట్టిన ఘటనలో ఓ విద్యార్థి మృతి చెందగా.. ఆటో డ్రైవర్‌తో పాటు మరో నలుగురు విద్యార్థులు గాయాలపాలయ్యారు. స్థానికులు, విద్యార్థుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆటికేటి ప్రవీణ్ తన సోదరుడి పిల్లలు ఆటికేటి సాత్విక, తేజక్షిత్‌లతో పాటు వీకే రామవరం గ్రామానికి చెందిన రచ్చా ఈశ్వర్, రచ్చా యశ్వంత్, కుంజా మోక్షిత్‌లను ప్రతిరోజూ తన ఆటోలో పాల్వంచలోని పలు పాఠశాలకు తీసుకువెళ్లి తీసుకువస్తుంటాడు. ఎప్పటిలాగే మంగళవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత విద్యార్థులను ఆటోలో ఇంటికి తీసుకువస్తుండగా శీతారాంపురం గ్రామ సమీపంలో ఓ కారు వేగంగా పాల్వంచవైపు వెళుతూ అదుపు తప్పి విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌తో పాటు ఐదుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని అంబులెన్స్‌లో పాల్వంచ ఏరియ వైద్యశాలకు తరలించగా పాల్వంచ డీఏవీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న రచ్చా ఈశ్వర్(12) అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ ఇతర విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం, ఖమ్మం ఆసుపత్రులకు తరలించారు. మృతి చెందిన విద్యార్థి ఈశ్వర్ సోదరుడు యశ్వంత్ కూడా అదే పాఠశాలలో 8వతరతి చదువుతున్నాడు. ఈశ్వర్ తండ్రి రచ్చా ఉపేందర్ ములకలపల్లిలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటోకు ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే పలువురు గ్రామస్థులు, విద్యార్థుల బంధువులు పాల్వంచ వైద్యశాలకు తరలి వెళ్లారు.



ప్రమాద స్థలంలో గాయపడ్డ విద్యార్థులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఈశ్వర్

భద్రాద్రిలో కొనసాగుతున్న నిమజ్జనోత్సవం

(3వ పేజీ తరువాయి)

వైద్యశాలకు తరలించారు. కాగా, ఈసారి భద్రాచలంలోని గోదావరిలో ఇప్పటి వరకు వెయ్యికిపైగా గణేష్ విగ్రహాలు నిమజ్జనమయ్యాయి. గత ఏడాది మూడు వేలకు పైగా విగ్రహాలు నిమజ్జనం కాగా ఈసారి ఆ సంఖ్య రెండువేల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఇటీవల కొద్ది రోజుల పాటు తెలంగాణలో చాలా చోట్ల భారీ వర్షాలు కురియడంతో చెరువులు నిండటంతో భద్రాచలం వచ్చే వారి సంఖ్య తగ్గినట్లు అంచనా వేస్తున్నారు. బుధవారం భారీగా విగ్రహాలు తరలివచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

కొత్తగూడెంలో ఘనంగా శోభయాత్ర

జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో గల ప్రకాశం మైదానంలో గణేష్ ఉత్సవకమిటి, విశ్వహిందుపరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిమజ్జన శోభయాత్ర పూజాకార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, గణేష్‌ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కేవి రంగాకిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ గణపతి నిమజ్జన ఉత్సవం కులమతాలకు అతీతంగా జరుపుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. ముందుగా నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలందుకున్న గణేష్‌టెంపుల్‌లోని గణనాధుల విగ్రహాలను సాయంత్రం 5గంటలకు ప్రకాశం మైదానానికి సంప్రాదాయ పద్ధతిలో తరలించి, అక్కడ ప్రత్యేక పూజలు చేసి అనంతరం నిమజ్జన శోభయాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, డీఎస్పీ రహమాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాష, బీఎస్పీ నాయకులు ఎర్రా కామేష్, రంగాకిరణ్, ధారారమేష్, చింటేశ్వర్, లక్ష్మణ్, పాండురంగాచార్యులు, వెంకట్, రజాక్ తదితరులున్నారు.

తెలంగాణలో అభివృద్ధి వికాసం

(3వ పేజీ తరువాయి)

క్వింటాకు రూ.500బోనస్ కూడా ప్రోత్సాహకంగా అందించబోతున్నామని, పంటల బీమా పథకం కింద ప్రభుత్వమే రైతుల తరుపున బీమా ప్రీమియం చెల్లించబోతున్నామని ఇందుకోసం రైతుసంక్షేమ కమిషన్ ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు.

సీతారామ ఎత్తిపోతల పాలేరు లింక్‌కెనాల్ ద్వారా 47,381ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించడంతో పాటు సాగర్ ఎడమకాలవ ఆయకట్టును స్థిరీకరించబోతున్నామని వివరించారు. ఏన్కూరు రాజీవ్ లింక్‌కెనాల్ రూ.77.05కోట్లతో 8.69కి.మీ. నిర్మాణం చేయడం జరిగిందని, తద్వారా 7115 ఎకరాలకు కొత్త ఆయకట్టుతో పాటు 1,11,818 ఎకరాల సాగర్ ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ నియామక పరీక్షల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, జాబ్‌కాలెండర్ కూడా విడుదలచేసి దానిక అనుగుణంగా ఉద్యోగ ఖాళీల భర్తీచేపట్టామని తెలిపారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చేందుకు విద్యాకమిషన్ ఏర్పాటుచేశామని, అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ స్కూళ్లుగా మార్చబోతున్నామని తెలిపారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

గతంలో ఎన్నడులేని విధంగా మున్నేరు, ఆకేరు, కట్టలేరు వరదలు పొంగి పెద్దఎత్తున జిల్లాలో నష్టం జరిగిందని దెబ్బతిన్న 15,096 కుటుంబాలకు రూ.16,500చొప్పునసాయం అందించామని, పునరవాస కేంద్రాల ద్వారా వారికి అవసరమైన సదుపాయాలు కలిపించి అన్ని విధాలా అధికారయంత్రాంగం, ప్రభుత్వం చేదోడుగా నిలిచిందని వివరించారు. పంటలు నష్టపోయని రైతులకు ఎకరానికి రూ.10వేలు పరిహారం త్వరలో అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క స్వాతంత్ర సమరయోధులను సన్మానించి, అభివృద్ధి, సంక్షేమపథకాలను స్టాల్స్‌ను తిలకించారు. దళితబంధు నుంచి రూ.10లక్షలతో డ్రోన్‌కెమెరా కొని ఉపాధి పొందుతున్న వైనాన్ని తిలకించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలకక్టర్ పి.శ్రీజ, మధుసూదన్‌నాయక్, శిక్షణసహాయ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ, జిల్ల అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్, జడ్పీసీఈవో దీక్షారైనా తదితరులు పాల్గొన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ, ఉపమేయర్ ఫాతిమాజోహార, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు జావీద్, వర్కింగ్‌ప్రెసిడెంట్ దీపక్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు..

పరిహారం కోసం పరేషాన్..

మున్నేరు వరద బాధితుల్లో ఇంకా అనేక మందికి అందని సాయం

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 17: ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల పరిధిలో గల మున్నేరు పరివాహక ప్రాంతంలో సెప్టెంబరు 1న వచ్చిన వరదతో తీరప్రాంతాలు అతలాకుతలమై వేలాదిమంది కట్టుబట్టలతో రోడ్డున పడిన విషయం విదితమే. ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటనల తర్వాత వరద ముంపునకు గురైన బాధితులను ఆదుకునేందుకు రెవెన్యూశాఖ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) సిబ్బంది ఐదు రోజులు పాటు ఇంటింటి సర్వే నిర్వహించారు. అయితే సర్వేతో పాటు బాధితుల బ్యాంకుఖాతాల సమాచారాన్ని కంప్యూటరీకరణ చేయడంలో చోటుచేసుకున్న తప్పిదాలు ఇప్పుడు బాధితులకు శాపాలుగా మారాయి. ఇంటి పక్కన వారికి ప్రభుత్వ పరిహారం అందినా, తమకు అందలేదని మున్నేరు పరివాహక ప్రాంతంలోని వరద బాధితులు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయానికి రోజూ క్యూ కడుతున్నారు.

ఐదురోజులు పాటు...

సెప్టెంబరు 4నుంచి 9వ తేది వరకు 5రోజులు పాటుగా రెవెన్యూశాఖ, కేఎంసీ బిల్ కలెక్టర్లు 14 బృందాలు మొదటి విడత ఇంటింటి సర్వే జరిపారు. సర్వేలో 9,242 బాధితులను గుర్తించారు. వీరిలో ఇప్పటి వరకు 8,500 బాధిత కుటుంబాల బ్యాంకు ఖాతాలకు పరిహారం డబ్బులు చేరాయి. ఇంకా 742 బాధిత కుటుంబాలకు పరిహారం అందలేదు. కాగా సర్వే అనంతరం మరో 700 మంది బాధితులు కేఎంసీలో దరఖాస్తులు చేయటంతో అధికారులు మంగళవారం రెండో విడత సర్వే ప్రారంభించారు. కాగా మంగళవారం మరో 600 మంది బాధతులు పరిహారం అందలేదని, మా ఇంటికి సర్వేకు ఎవ్వరూ రాలేదని దరఖాస్తులు చేశారు. పెద్ద ఎత్తున ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయానికి చేరుకొని అధికారులకు దరఖాస్తులలు చేశారు. దీంతో ఇంకా పరిహారం అందాల్సిన దరఖాస్తుల సంఖ్య 1,342కు చేరింది.

వారి తప్పిదాలు... బాధితులకు శాపాలు

మున్నేరు వరద ముంపు సర్వే అనంతరం జరిగిన బాధితుల ఆన్‌లైన్ నమోదుపై ఇప్పుడు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూశాఖ, కేఎంసీ బిల్ కలెక్టర్లు సర్వేలో చేసిన తప్పిదాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. బాధిత కుటుంబ యజమాని ఆధార్ కార్డును సేకరించిన సర్వే బృందాలు ఆధార్ కార్డులోని వ్యక్తి బ్యాంకు ఖాతా నెంబర్ కాకుండా కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతా నెంబర్‌లను నమోదు చేశారు. బ్యాంకుల ఐఎఫ్ఎస్‌సీ కోడ్లులు, బ్యాంకు పేర్లు నమోదులో సర్వే బృందాల తప్పిదాలు వెలుగులోకి వస్తున్నాయి. కాల్వొడ్డులో జరిగిన సర్వేలో ఒక ప్రధాన వీధిలోని బాధితుల బ్యాంకు ఖాతాల నెంబర్లు తప్పుగా నమోదు జరిగాయి. సర్వే అనంతరం బాధితుల జాబితాలను కంప్యూటరీకరణ సమయంలో నిర్లక్ష్యంగా కంప్యూటర్ ఆపరేటర్లు వ్యవహరించటంతో బాధితుల బ్యాంకు ఖాతాలకు పరిహారం అందలేదని వాస్తవాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి.



బ్యాంకు పాస్ పుస్తకాలు చూపుతున్న బాధితులు

మా బజార్ మొత్తం తప్పుగా రాశారు..

● షేక్ షలీమా, బొక్కలగడ్డ



నా ఒక్కదానిదే కాదు. మా బొక్కలగడ్డలో ఓ బజార్ మొత్తం తప్పుగా రాశారు. బ్యాంకు పాస్ పుస్తకాలు ఇచ్చిన కూడా డబ్బులు పడలేదు. మా ఇల్లు మొత్తం పోయింది. అధికారులు మొత్తం చూసి రాసుకున్నారు. కానీ పైసా ఇవ్వలేదు. ఇప్పుడు బ్యాంకు నెంబర్ తప్పుగా నమోదైందని చెపుతున్నారు.

20వ తేదీ వరకు పరిహారం అందుతుంది...

● ఆర్.శ్రీనివాసరావు, రెవెన్యూ ఆఫీసర్, కేఎంసీ



మొదటి విడత సర్వేలో నమోదైన బాధితుల్లో ఇంకా 800 మంది బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ కావాల్సి ఉంది. ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాలు ఉన్న వారికి జమ జరిగాయి. ప్రైవేట్ బ్యాంకులు, చిన్న బ్యాంకుల ఖాతాలు ఉన్న ముంపు బాధితులకు ఆయా బ్యాంకులు డబ్బులు జమ చేయలేదు. బ్యాంకులకు డబ్బులు చేరాయి. కొన్ని సర్వే తప్పిదాలు, బ్యాంకు ఎకౌంట్ తప్పిదాలపై ఫిర్యాదులు వచ్చాయి. వాటిని సరి చేస్తున్నాం. రెండు రోజులు వరసగా బ్యాంకులకు సెలవులు రావటంతో కొన్ని గ్రామీణ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకుల నెంబర్లు కలిగిన బాధితులకు పరిహారం వెళ్లలేదు. 20వ తేది వరకు పరిహారం అందుతుంది.


ఖమ్మంలో ప్రజలకు అభివాదం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



గ్యాస్ సిలిండర్ల పంపిణీలో భాగంగా బాండ్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి


ఖమ్మంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి


కొత్తగూడెంలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరావు

ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

లాభదాయ ఉత్పత్తులపై అవగాహన పెంచాలి



లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు17: లాభదాయ ఉత్పత్తులపై రైతులకు అవగాహన పెంచాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు ఆదేశించారు. మంగళవారం కొత్తగూడెంలోని ప్రకాశం మైదానంలో ప్రజాపాలన వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన స్టాల్స్ మంత్రి తుమ్మల సందర్శించి మాట్లాడారు.

స్టాల్స్‌లో మంత్రి తుమ్మల వ్యవసాయ క్షేత్రంలో పండించిన పామాయిల్ గెల...

కొత్తగూడెం ప్రకాశం మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయక్షేత్రంలో ఆయన పండించిన పామాయిల్ గెలను ప్రద ర్శించారు. రైతు తుమ్మల నాగేశ్వరరావు పేరిట 60కిలోలు కలిగిన ఈ పామాయిల్ గెల చూపరులను ఆకట్టుకుంది. దీనిని మంత్రి తుమ్మల సైతం సందర్శించి భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఆయిల్ ఫాం సాగులో రాష్ట్రంలో తలమానికంగా నిలిచిందని సంతోషం వ్యక్తం చేశారు.


ఖమ్మంలో నిర్వహించిన ప్రజాపాలనకు హాజరైన అధికారులు, నాయకులు


కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల


స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


గోపి మృతదేహం

మధిర, సెప్టెంబరు 17: ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధిర మండలంలోని ఆత్కూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ దాల్ కృష్ణ కుమారుడు దాల్ గోపి(30) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో కుమార్తె అభిసారికకు చిన్నతనం నుంచే అనారోగ్యంతో బాధపడుతుంది. కాగా కుమార్తె వైద్యం కోసం రూ.12లక్షల వరకు ఖర్చు చేశాడు. అయినా కుమార్తె ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో చేసిన అప్పులు ఎక్కువ అవ్వడంతో ఇటీవల మానసికంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఇంటి వెనుకల ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి కుమారుడు ఆత్మహత్య

- కాపాడేందుకు వెళ్లిన తండ్రికి గాయాలు
- ఖమ్మంలో ఘటన

ఖమ్మం క్రైం సెప్టెంబరు 17: రైలు కిందపడి కుమారుడు ఆత్మహత్య చేసుకునేందుకు వెళుతుండగా, అతడిని కాపాడేందుకు వెళ్లి తండ్రికి కూడా గాయాలైన సంఘటన మంగళవారం ఖమ్మం నగర పరిధిలోని రైల్వే స్టేషన్ ట్రాక్ పై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..దానవాయిగూడేనికి చెందిన షేక్ ముస్తఫా(30) కుటుంబ సమస్యలతో రైలు కిందపడి చనిపోతానంటూ తండ్రికి చెప్పి, రైల్వే ట్రాక్‌పై పరిగెత్తాడు. వెంటనే అక్కడే ఉన్న తండ్రి షేక్ బాజీ అతడిని కాపాడేందుకు అతని వెంట పరిగెత్తాడు. అదే సమయంలో రైలు రాగా పట్టాలపై పరిగెత్తుతున్న ముస్తఫాను రైలు ఢీకొట్టింది. దీంతో అతడిని కాపాడేందుకు వెళ్లిన తండ్రి కూడా ప్రమాదవశాత్తు కింద కిందపడి చేయి విరిగింది. దీంతో స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన వద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అనంతరం తండ్రి షేక్ బాజీ ని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించి రైల్వే పోలీసులు వివరాలు తెలుసుకున్నారు.

మధిర రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడి మృతి

మధిర, సెప్టెంబరు 17: మధిర రైల్వే స్టేషన్ రెండో నెంబర్ ప్లాట్‌ఫారంలో ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన కత్తుల శ్రీను(36) అనే ప్రయాణికుడు మంగళవారం మధ్యాహ్న సమయంలో సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి మధిరలో దిగాడు.

ఒకటి నుంచి రెండో నెంబర్ ప్లాట్‌ఫారంపైకి వెళ్లి అనారోగ్య ంతో మృతి చెందాడు. సాయంత్రం గుర్తించిన రైల్వే పోలీసులు అతడి వద్ద లభించిన వివరాల ఆధారంగా ఎస్ఐ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ ఎస్. వేణుగోపాలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఎంపీలు హద్దులు దాటి వైద్యం చేస్తే చర్యలు

- భద్రాద్రి ఢ్యూటీ డీఎంహెచ్‌వో రేపాక చైతన్య
- ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసిన అధికారులు
- ఆంధ్రజ్యోతి కథనంతో మూతబడిన పలు క్లినిక్‌లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చైతన్య

దుమ్ముగూడెం, సెప్టెంబరు 17: హద్దులు దాటి ఆర్ఎంపీలు వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో రేపాక చైతన్య అన్నారు. మంగళవారం తూరుబాక గ్రామీణ వైద్యుడు ఉపేందర్ క్లినిక్‌ను డిప్యూటీ డీఎంహెచ్‌వో రేపాక చైతన్య ఆధ్వర్యంలో నరసాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సుభాష్ మంగళవారం సీజ్ చేశారు. ఆంధ్రజ్యోతిలో ఈనెల 17న 'హద్దులు మీరుతున్న ఆర్ఎంపీ అపరిమిత వైద్యం' అనే కథనం వెలువడిన విషయం తెలిసిందే. వైరల్ జ్వరంతో మృతి చెందిన మోతుకూరి వరప్రద మృతికి గల కారణాలను జిల్లా వైద్య శాఖ అధికారి ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో చైతన్య విచారణ జరిపారు. మృతురాలి తల్లిదండ్రులతో మాట్లాడిన అనంతరం ఆర్ఎంపీ క్లినిక్‌ను పరిశీలించి, వరప్రదకు అందించిన వైద్యం వివరాలను సేకరించారు. ఆర్ఎంపీ నుంచి రాతపూర్వక వివరణ కోరారు. నివేదికను డీఎంహెచ్‌వోకు పంపుతామని నరసాపురం వైద్యాధికారి తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, పీహెచ్‌సీల పరిధిలో సర్వే జరిపి అపరిమిత వైద్యం చేసే ఆర్ఎంపీల జాబితాను పంపాలని వైద్యాధికారులకు సూచించినట్లు తెలిపారు. కాగా ఆంధ్రజ్యోతి కథనంతో మండలంలోని పలు ఆర్ఎంపీల క్లినిక్‌లు బుధవారం మూతపడ్డాయి. అధికారులు దాడులు చేస్తారనే భయంతో క్లినిక్‌లు మూతపడగా, పీహెచ్‌సీల్లో చికిత్సల కోసం ఒక్కసారిగా ఔట్ పేషంట్లు పెరిగారు. సబ్-యూనిట్ అధికారి ధర్మారావు, ఎంటీఎస్ రామకృష్ణ, హెచ్ఏ బాబూరావు, ఏఎన్ఎం నాగమణిలున్నారు.

జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి సాంకేతిక ప్రదర్శన

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు


కలెక్టర్ జితేష్. వి. పాటిల్‌ను సత్కరిస్తున్న కొత్వాల

కొత్తగూడెం, ఆంధ్రజ్యోతి, సెప్టెంబరు 17: రైతులకు వ్యవసాయ రంగంలో మెలకువలు తెలియజేసేందుకు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్క్‌ఫెడ్ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో రెండు రోజులపాటు వ్యవసాయ సాంకేతిక ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన తుమ్మలకు ఘనస్వాగతం పలికారు. జిల్లా ప్రగతిపై మంత్రి తుమ్మల ప్రసంగం తరువాత కార్యక్రమానుద్దేశించి కొత్వాల మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని వ్యవసాయ అనుబంధశాఖ శాస్త్రవేత్తలను, వారు రూపకల్పన చేసిన విధానాలను పొందుపర్చేవిధంగా చూపరులకు అర్థమయ్యేరీతిలో స్టాల్స్‌ను ఏర్పాటుచేశారని కలెక్టర్ జితేష్ విపాటిల్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన సాంకేతికపరమైన శాఖల శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ శాఖమాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, ఎస్పీ రోహిత్ రాజ్‌లకు జిల్లా రైతాంగం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కొత్తగూడెం సొసైటీ అధ్యక్షుడు మండె వీరహనుమంతరావు, ఉపాధ్యక్షుడు జగన్, సీనియర్ అడ్వకేట్ పలివెల సాంబశివరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగ సీతరాములు, విజయాబాయి, వై. వెంకటేశ్వర్లు, దారా చిరంజీవి, కాపర్తి వెంకటచారి, పైడిపల్లి మహేష్ పాల్గొన్నారు.

సింగరేణిలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలి

- సింగరేణి గుర్తింపు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి, రాజ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

కొత్తగూడెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయిందని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్‌కుమార్‌లు ఆరోపించారు. మంగళవారం స్థానిక శేషగిరి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తుందని విమర్శించారు. గత ప్రభుత్వం సింగరేణిలో విపరీతమైన జోక్యం చేసుకోవడం వల్ల, నేడు ఆ పార్టీ అనుబంధ యూనియన్ కాలగర్భంలో కలిసిపోయిందన్నారు. డైరెక్టర్ పా శ్రీనివాసులను తొలగించాలని గుర్తింపు సంఘం యాజమాన్యానికి ఫిర్యాదు చేసిందని, కొన్ని సంఘాలు ప్రచారం చేస్తున్నాయని అది అవాస్తవం అన్నారు. డైరెక్టర్ పా తొగింపుపై సింగరేణి వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు ప్రతి సమష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శేషయ్య, సారయ్య, కృష్ణపర్, వీరస్వామి పాల్గొన్నారు.

యువ కార్మికులు శ్రమశక్తిని చాటితేనే ఉజ్వల భవిష్యత్

- సింగరేణి సీఎండీ బలరాం


మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం, ఆంధ్రజ్యోతి, సెప్టెంబరు17 : సింగరేణి వ్యాప్తంగా 50శాతం కన్నా అధికంగా యువత విధులు నిర్వర్తిస్తున్నారని.. ఈ యువశక్తి సంఘటితంగా తమ శ్రమ శక్తిని చాటితే కంపెనీ ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీఎండీ బలరాం అన్నారు. సింగరేణి భవన్‌లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఎగురవేసి కార్యక్రమానుద్దేశించి మాట్లాడుతూ.. రానున్న ఐదేళ్లలో సింగరేణి 60వేల టర్నోవర్‌ను సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సింగరేణి వ్యాపార విస్తరణ దిశగా ముందుకు వెళ్తాందన్నారు. ప్రధానంగా భవిష్యత్‌లో రాజస్థాన్‌లో సోలార్ పవర్‌ప్లాంట్, సింగరేణిలో మూసివేసిన ఉపరితల గనుల్లో పంప్ స్టోరేజ్ ప్లాంట్లు, ఒడిశాలో నైనీ బొగ్గు బ్లాకుల సమీపంలో 1600 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ నిర్మాణం, రాష్ట్రంలో 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ బ్యాటరీ స్టోరేజ్ సిస్టం, తదితర వినూత్న ప్రాజెక్టులతో సింగరేణి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేస్తున్నట్లు తెలిపారు. సంస్థ అభివృద్ధికి ఈ ప్రాంత యువతకు పెద్దసంఖ్యలో ఉద్యోగ కల్పనలో కార్మికులు, అధికారులు, కార్మిక సంఘాల నాయకుల తోడ్పాటు అవసరమన్నారు. సమిష్టిగా లక్ష్య సాధనకు కృషి చేస్తే దేశంలోనే అగ్రగామి సంస్థ సింగరేణిని ఉన్నతస్థాయిలో నిలపడం సాధ్యమౌతుందన్నారు. బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే లక్ష్యంగా ఉద్యోగులంతా పనిచేసి ఉత్పాదకతను పెంచడంతో తక్కువ దరకు బొగ్గు సరఫరా చేస్తున్నామన్నారు. దీంతో విద్యుత్ వినియోగదారులపై భారాన్ని తగ్గిస్తున్నామన్నారు. పోటి మార్కెట్‌లో నిలదొక్కుకోవాలంటే నాణ్యత రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్‌డీఎం సుభానీ (జీఎం కోఆర్డినేటర్), డి. రవిప్రసాద్ (జీఎం మార్కెటింగ్), అన్ని విభాల ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌మానక్‌లో భవ్యశ్రీ ప్రతిభ

భద్రాచలం, సెప్టెంబరు 17: భద్రాచలంలోని త్రివేణి పాఠశాలలో చదివే పారెల్లి భవ్యశ్రీ ఢిల్లీలో జరుగుతున్న జాతీయస్థాయి మానక్ పోటీల్లో సత్తా చాటింది. దేశవ్యాప్తంగా 875 మంది ఎగ్జిబిట్లు పాల్గొనగా భవ్యశ్రీ ఎగ్జిబిట్ ప్రొఫెసర్లు, సైంటిస్టుల ప్రశంసలందుకుంది. రైతన్నలకు ఈ మిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని దీనిని తయారు చేసిన భవ్యశ్రీ గైడ్ టీచర్ నాగలక్ష్మిని అభినందించారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, సెప్టెంబరు 17: భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల(స్వయం)లో కంప్యూటర్‌సైన్స్ బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.జాన్ మిల్టన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

మధిర చెరువును పరిశీలించిన పర్యాటక శాఖ అధికారులు


వివరాలు అడిగి తెలుసుకుంటున్న పర్యాటకశాఖ అధికారులు

మధిర, సెప్టెంబరు 17: మధిర పెద్ద చెరువును, ట్యాంక్ బండ్ పార్కును పర్యాటక శాఖ అధికారులు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. మధిర చెరువును పర్యాటకంగా అభివృద్ధిలో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలపై పర్యాటకశాఖ అధికారులు పరిశీలించారు. ఇటీవల వచ్చిన వర్షాలకు చెరువు రోడ్డు దెబ్బతినడం, పార్కు రోడ్డు ధ్వంసమవ్వడం తదితర విషయాలను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో తెలంగాణ టూరిజం జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి, ఎస్ఈ సునీత, జిల్లా అధికారి సుమన్ చక్రవర్తి, ఆర్కిటెక్ అధికారి సమిత, ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్, ఈఈ సీహెచ్ రామకృష్ణ, డీఈ నాగబ్రహ్మం, ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఈఈ తానేశ్వర్, డీఈ శంకర్‌రావు, తహసీల్దార్ రాంబాబు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి: కలెక్టర్ పాటిల్

బూర్గంపాడు, సెప్టెంబరు 17: ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం బూర్గంపాడు మండల పరిధిలోని కృష్ణసాగర్ గ్రామపంచాయతీలో అమ్మ పేరున ఒక చెట్టు నాటుదాం అనే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మొక్కలు నాటి మాట్లాడారు. ఔషధ మొక్కలు, పూల మొక్కలు, పర్యావరణాన్ని రక్షించే మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో సునీల్, ఏవో శంకర్, పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి, పాల్గొన్నారు.

యూనియన్‌లో తిరగడం లేదని డ్రైవర్‌పై దాడి

ఖమ్మం క్రైం సెప్టెంబరు 17: ఓ ఆటో డ్రైవర్ వేరే యూనియన్‌లో తిరుగుతున్నాడని కొంతమంది కర్రలతో దాడిచేసిన సంఘటనలో ఖమ్మం ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్ నందు మంగళవారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అగ్రహారం కాలనీకి చెందిన షేక్ నాగుల్‌మీరా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తాడు. ఓ ఆటో యూనియన్ వారు ఇటీవల అతడి వద్దకు వచ్చి తమ యూనియన్‌లో తిరగాలని, వేరే యూనియన్‌లో తిరగొద్దని బెదిరించారు. అయినా వారి యూనియన్‌లో తిరగడం లేదని, అదే ప్రాంతానికి చెందిన కర్లపూడి వెంకన్న, బరిగెల వీరబాబు, కట్ల ప్రసాద్, రావుల సతీష్, అక్కి సంతోష్‌లు సోమవారం సాయంత్రం గణేష్ నిమజ్జనం సమయంలో అతడి ఇంటి దగ్గరకు గణేష్ విగ్రహం రాగానే వారంతా అతడిపై ఒక్కసారిగా కర్రలతో దాడిచేశారు. ఈ ఘటనలో నాగుల్‌మీరాకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్

చండ్రుగొండ, సెప్టెంబరు 17: ఆర్టీసీ బస్సులో గంజాయిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను మంగళవారం చండ్రుగొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలం నుంచి గుంటూరు వెళుతున్న టీఎస్ ఆర్టీసీ బస్సును సారపాక వద్ద నలుగురు వ్యక్తులు నాలుగు బ్యాగులతో ఎక్కారు. ఈ నలుగురు గంజాయితో ప్రయాణిస్తున్నట్లు సమాచారం మేరకు చండ్రుగొండ ప్రధాన సెంటర్లో బస్సును ఆపి సోదాలు నిర్వహించారు. వారి వద్ద సుమారు 10 కేజీల గంజాయి లభ్యం కావడంతో వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై చండ్రుగొండ ఎస్ఐ స్వప్న వివరణ ఇస్తూ గంజాయితో బస్సులో ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, పూర్తి వివరాలు తరువాత వెల్లడిస్తామని తెలిపారు.

సీతారాముల వారి శాంతి కల్యాణం

భద్రాచలం, సెప్టెంబరు 17: భద్రాచలంలోని శ్రీ వాసవీ కన్వెన్షన్‌లో మంగళవారం ఖగోళ యాత్ర ముగింపును పురస్కరించుకొని సీతారాముల వారి శాంతికల్యాణంను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిపించారు. శ్రీరామ టెంపుల్ ఆఫ్ యుఎస్ఏ ఖగోళ యాత్ర ఆగస్టు 17న అయోధ్యలో ప్రారంభం కాగా సెప్టెంబరు 17న భద్రాద్రిలో పరిసమాప్తమైంది. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్యవైశ్య ప్రముఖులు యశోద రాంబాబు దంపతులు, శ్రీరామ టెంపుల్ ఆఫ్ యుఎస్ఏ అర్చకులు అర్చకం పద్మనాభాచార్యులు, వ్యాఖ్యత గాంధీ వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.


కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

తగ్గిన గోదావరి నీటిమట్టం

భద్రాచలం, సెప్టెంబరు 17: భద్రాచలంలో గోదావరి నీటిమట్టం మరింతగా తగ్గింది. సోమవారం రాత్రి 10 గంటలకు 24.2 అడుగులున్న గోదావరి మంగళవారం ఉదయం 6 గంటలకు 22.5 అడుగులకు, 10 గంటలకు 21.8 అడుగులకు, 4 గంటలకు 21.2 అడుగులకు, 6 గంటలకు 20.7 అడుగులకు తగ్గింది.

రామయ్యను దర్శించిన నైమిశారణ్య పీఠాధిపతులు


పూజలు చేస్తున్న బాల బ్రహ్మానంద సరస్వతి

భద్రాచలం, సెప్టెంబరు 17: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారిని నైమిశారణ్య పీఠాధిపతులు బాల బ్రహ్మానంద సరస్వతి స్వామీజీ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిత్రకూట మండపంలో శ్రీరామనామతత్వం అనే అంశంపై భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ వి.రవీంద్రనాథ్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, సీసీ శ్రీనివాసరెడ్డి, పండితులు చిట్టి హనుమత్‌శాస్త్రి, రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే రాగమయి పరామర్శ


బుగ్గపాడులో చిన్నారి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డా.రాగమయి

సత్తుపల్లి, సెప్టెంబరు17: సీతారామ ప్రాజెక్టు కాలువలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులను సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.మట్టా దయానంద్‌లు మంగళవారం పరామర్శించారు. సీతారామ కాల్వలో సోమవారం విద్యార్థులు జీతేందర్‌కుమార్, శశాంక్‌లు ప్రమాదవశాత్తూ పడి మృతి విషయం విధితమే. ప్రమాదం జరిగిన కాలువ ప్రాంతాన్ని ఎమ్మెల్యే సందర్శించి, మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గడ్డొరుగట్ట భూముల్లో పోడు వివాదం

దుమ్ముగూడెం, సెప్టెంబరు 17: దుమ్ముగూడెం అటవీ రేంజి పరిధి గడ్డొరుగట్టు రిజర్వ్ ఫారెస్టు భూమిలో మంగళవారం పోడు వివాదం జరిగింది. గత ఏడాది సుమారు 30 ఎకరాల రిజర్వ్‌ఫారెస్టు భూమిలో అటవీశాఖ నాటిన మొక్కలను నరికి పోడుసాగుకు స్థానికులు ప్రయత్నించారు. ఈ క్రమంలో అటవీశాఖ, స్థానిక ఆదివాసీల మధ్య వివాదం చోటుచేసుకుంది. సదరు భూమిపై పోడు హక్కు పత్రాలున్నాయని ఆదివాసీలు తెలపగా, చూపించమని అటవీశాఖ అధికారులు అడిగారు. గొడవ జరిగే పరిస్థితి కనబడడంతో అటవీశాఖ అధికారుల సమాచారంతో సీఐ అశోక్ అక్కడకు వెళ్లారు. ఎఫ్‌డీవో సుజాత, ఎఫ్ఆర్వో కమల, ఎఫ్ఎస్వో నందా, రేంజి సిబ్బంది ఉన్నారు.

సింగరేణిలో స్వచ్ఛత దినోత్సవం

ఇల్లెందుటౌన్, సెప్టెంబరు 17: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం సింగరేణి ఇల్లెందు ఏరియాలోని వివిధ గనులు, డిపార్ట్‌మెంట్‌లోని స్వచ్ఛత స్పెషల్ క్యాంపియన్ నిర్వహించారు. స్థానిక జీఎం కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు స్వచ్ఛత ప్రతిజ్ఞను చేశారు. ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు స్వచ్ఛత కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. పరిసరాలు, పర్యావరణం ఉండే విధంగా స్వచ్ఛత వైపు కేంద్రీకరిస్తున్నట్టు వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం వేంకటేశ్వర్లు, ఏజీఎం గిరిదర్‌రావు, డీజీఎం పర్సనల్ జీవి మోహన్‌రావు, అధికారులు బాలాజీనాయుడు, దనుంజైరెడ్డి, గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి లక్కిరాం, పాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అసలు వ్యక్తికి బదులు పరీక్ష రాసిన కేసులో యువతికి జైలు

కొత్తగూడెం లీగల్, సెప్టెంబరు 17: అసలు వ్యక్తికి బదులు నకిలీ వ్యక్తి 10వ తరగతి పరీక్షలు రాసిన కేసులో యువతికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కొత్తగూడెం రెండవ అధనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ మంగళవారం తీర్పు చెప్పారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన నీరు కొండ షాహాజి బాబు చీఫ్ పరీక్షల విభాగం పదో తరగతి రాంనగర్‌కు చెందిన ఎస్ఆర్ డిజిటల్ స్కూల్ సెంటర్ నందు తనిఖీ చేస్తుండగా బాణోత్ రమేష్ ఇన్విజిలేటర్‌కు అనుమానం రాగా పరిశీలించుచుండగా రూమ్ నెంబర్ 19 నందు రాచబంటి శేషమణికి బదులు ఈ .అనూష అనే మైనరు పరీక్ష రాయుచుండగా అనుమానం వచ్చి విచారించగా దొరికిపోయి నిజము ఒప్పుకున్నదని శేషమణికి సంబంధించిన హాల్ టిక్కెట్, ఆన్సర్ షీటులు జత చేసి బాణోత్ రమేష్ చీఫ్ సూపరింటెండెంట్ ఆఫ్ పరీక్షల విభాగం చీఫ్‌కు ఫిర్యాదు చేయగా ఆయన విచారించగా నేరము ఒప్పుకున్నదని వన్‌టౌన్ కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ వారికి 2016 మార్చి 31న నీరుకొండ షాహాజీబాబు ఫిర్యాదు చేయగా అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జి షీటు దాఖలు చేశారు. ఐదుగురు సాక్షుల విచారణ అనంతరం రాచబంటి శేషమణి పై నేరం రుజువు కాగా ఏపీ పబ్లిక్ ఎగ్జామ్స్ ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టీస్, అన్‌ఫెయిర్ మీన్స్ యాక్ట్ ప్రకారం మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5000ల జరిమానా, సెక్షన్ 419 ఐపీసీ ప్రకారం ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను విశ్వశాంతి నిర్వహించారు. కోర్టు లైజాన్ ఆఫీసర్ మహ్మద్ అబ్దుల్ ఘని(కోర్టు డ్యూటీ ఆఫీసర్) చుంచుపల్లి కోర్టు పిసి రామకృష్ణ సహకరించారు.

మోసం చేసిన కేసులో వ్యక్తికి జరిమానా

కొత్తగూడెం లీగల్, సెప్టెంబరు 17: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తికి జరిమానా విధిస్తూ కొత్తగూడెం రెండవ అదనపు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.సాయిశ్రీ మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడెం కూలీలైన్‌కు చెందిన ఎండి.షామాను కొత్తగూడెం గాజులరామ్ బస్తీకి చెందిన మహ్మద్ అబ్దుల్ మాలిక్ ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేయగా, అతని తల్లిదండ్రులను అడగగా డెలివరీ అయిన తర్వాత మాట్లాడదామని చెప్పారని పేర్కొన్నారు. తాను డెలివరీ అయిన తర్వాత కుమారుడు కలిగాక వెళ్ళి అడగగా నాకు ఎలాంటి సంబంధం లేదు మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి మీ దిక్కున్న చోట చెప్పుకోండి అని తెలుపగా కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ వారికి 2012 ఏప్రిల్ 5న ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐలు సీహెచ్ మధుసూధన్‌రెడ్డి, పి.దేవేందర్‌రావులు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టులో ఏడుగురు సాక్షులు విచారణ అనంతరం అబ్దుల్ మాలిక్‌పై నేరం రుజువు కాగా రూ.5000లు జరిమానా లేదా రెండు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను విశ్వశాంతి నిర్వహించారు. ఎమ్‌డి.అబ్దుల్ ఘని (కోర్టు డ్యూటీ ఆఫీసర్) కొత్తగూడెం త్రీటౌన్ పిసి శోభన్ సహకరించారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

» క్యాంపు కార్యాయాల్లో జాతీయ జెండాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, కలెక్టర్ పాటిల్, ఎస్పీ రోహిత్


కొత్తగూడెం పోలీసు గ్రౌండ్‌లో ఎస్పీ


ఇల్లెందు మునిసిపల్ కార్యాలయంలో..


టేకులపల్లిలో తహసీల్దార్


బూర్గంపాడులో..


అశ్వాపురంలో..


కలెక్టరేట్‌లో జాతీయ జెండాకు వందనం సమర్పిస్తున్న కలెక్టర్ పాటిల్, ఇతర అధికారులు

నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయజెండాలు ఆవిష్కరించారు. అశ్వారావుపేట, పినపాక, ఇల్లెందు ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్యలు క్యాంపు కార్యాలయాల్లో జెండా ఆవిష్కరించారు. ఈ సందరంగా ఎమ్మెల్యేలు మాట్లాడారు.

రాష్ట్రంలో ప్రజాపాలన ప్రారంభమైందని, పేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రారంభమయ్యాయని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ప్రజా అభిప్రాయాలకు అనుగుణంగ ప్రజా పాలన జరుగుతుందన్నారు. ఈ రోజున తెలంగాణాకు ప్రత్యేక పాలన ప్రారంభమైన రోజని, ఇది అందరికి సంతోషదాయకమైన దినంగా ఆయ న అభివర్ణించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుంకవల్లి వీరభ ద్రరావు, తుమ్మా రాంబాబు, సొసైటీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, ప్రమోద్, ఉపేం ద్ర, నంద్రు రమేష్ నార్లపాటి రాములు, లింగిశెట్టి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే కోరం

ప్రజాపాలన దినోత్సవన వేడుకలు ఇల్లందు పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఇల్లెందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ కార్యాయంలో చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు, తహసీల్దార్ కార్యాలయంలో తొటరవికుమార్‌లతో పాటు పలువురు అధికారులు జెండాలు ఆవిష్కరించారు.

మణుగూరులో పాయం

మణుగూరు మండంలో ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖల ఉన్నతాధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటే శ్వర్లు జాతీయ జెండాను ఎగురవేసి ప్రజాపాలన విషయాలను వివరించారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన వేడుకలు..

ఎంతోమంది త్యాగాలతో హైదరాబాద్ నిజాం సంస్థానం ఇండియన్ యూనియన్ గవర్నమెంట్‌లో విలీనమైందని 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలకు స్వాతంత్ర్యం సిదించిందని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ పంకజ్ పరితోష్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, జిల్లా పోలీస్ కార్యాలయ ఏఓ జయరాజ్, సీఐలు వెంకటేశ్వర్లు, కరుణాకర్, రమేష్, శివప్రసాద్, ఆర్ఐలు రవి, నరసింహారావు, లాల్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. ఐడీఓసీ కార్యాలయంలోప్రజాపాలన దినోత్సవ కార్యక్రమంలో బాగంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వీ పాటిల్ జాతీయజెండాకు గౌరవ వందనం చేశారు. అనంతరం కార్యక్రమానుద్దేశించి కలెక్టర్ ప్రసంగించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి, కలెక్టర్ జాతీయ పతకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు.

సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం: తెల్లం

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రతి నిత్యం ప్రజల సమస్యను పరిష్కరించడంతో పాటు అనేక సంక్షేమ పథకాలతో ముందుకు వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఇదిలా ఉండగా భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ప్రాంగణంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు.


భద్రాచలంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్


మణుగూరులో ఎమ్మెల్యే పాయం


ఇల్లెందు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం


అశ్వారావుపేటలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ


పాల్వంచలో..

తెలంగాణ విమోచన, విలీన దినోత్సవం

కొత్తగూడెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందు, ముస్లీంల మధ్య జరిగిన పోరాటంగా చిత్రికరించి మతవిద్వేషాలను రెచ్చగొట్టడం కోసం మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర నాయకులు కేచ్చెల రంగారెడ్డి , రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ అన్నారు. మంగళవారం ఆ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం అధ్యక్షతన జరిగిన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. సెప్టెంబరు 17 ముమ్మాటికి విద్రోహ దినమని అన్నారు. నాయకులు జాటోత్ కృష్ణ, కె.కల్పన. అమర్లపుడి రాము, నూప భస్కర్, రాజు, మధుసూధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో.. న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ విద్రోహ దినంగా పాటించారు. ఎన్డీ రాష్ట్ర నాయకుడు అవునూరి మధు మాట్లాడుతూ భూమి. భుక్తి. విముక్తి కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ డి నాయకులు తుపాకుల నాగేశ్వర్ రావు. సారంగపాణి. నరాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు. సీపీఐ . సీపీఎం ఆధ్వర్యంలో తెలంగాణ విముక్తి పొందిన రోజు సందర్భంగా కార్యక్రమాలు జరిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో....

ఇల్లెందు: విమోచన దినోత్సవం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు మిరియాల వెంకన్న జాతీయ జెండా ఆవిష్కరించారు. ఇల్లెందు నియోజకవర్గ కన్వీనర్ బాలగాని గోపికృష్ణ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సేనాపతి మురళీకృష్ణ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మావునూరి మాధవ్ సీనియర్ నాయకులు శాసనాల రామయ్య రామచంద్రనాయక్ .శివకుమార్ యువమోర్చా నాయకు లు రాహుల్ రజత్ కుమార్ కోరి .శివం సంతోష్ తదితరులు పాల్గొన్నారు...

లక్ష్మీదేవిపల్లి: బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధాని నరేంద్ర దామోదర్ దాస్ మోదీ జన్మదిన వేడుకలను మంగళవారం బూడిద గడ్డ స్నేహలత, సంధ్యాలత అనాధాశ్రమంలో నిర్వహించారు.బీజేపీ జిల్లా నాయకులు ఆకుల నాగేశ్వరరావు గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ తిమ్మిరి నరేంద్ర బాబు, పైడిపాటి రవీందర్, బుడిగాం రవి కుమార్, మహిళా నాయకురాలు బానోత్ విజయలక్ష్మి, రాజేశ్వరరావు, చుంచుపల్లి మండల అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు, పూర్ణచందరావు, వెంకటరమణ, సత్యనారాయణ, రాజు, వీరన్న, మోహన్‌రావు, రామారావు, విజయ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాస్‌లైన్ కేంద్ర నాయకుడు కేచ్చెల రంగారెడ్డి

సీపీఐ తోనే నిజాం పాలకుల నుంచి ప్రజలకు విముక్తి: అయోధ్య

మణుగూరు తెలంగాణలో నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కల్గించి, ప్రజలకు స్వేచ్ఛావాయులకు అందించడంలో సీపీఐ నాయకత్వం ఎనలేని కృషి చేసిందని, తెలంగాణ రైతాంగ సాయుధపోరును నడిపి ప్రాణాలను అర్పించి అరాచక పాలను చరమ గీతం సీపీఐ పాడిందని సీపీఐ రాష్ట్ర నేత బి అయోధ్య అన్నారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో సమితిసింగారం రజబ్ అలీ స్తూపం వద్ద జరిగిన సాయుధ పోరాట వారోత్సవాల్లో అయోధ్య పాల్గొన్నారు. సీపీఐపార్టీ జెండా ను అవిష్కరించారు.

విహారయాత్రలో విషాదం

● కన్యాకుమారి బీచ్‌లో పాల్వంచ విద్యార్థి మృతి, సుజాతనగర్ విద్యార్థి పరిస్థితి విషమం

సుజాతనగర్, సెప్టెంబరు 17 : విహారయాత్రలో విషాదం చోటు చేసుకున్న సంఘటన మంగళవారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం లోని కన్యాకుమారిలో గల జాయ్ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న 30 మంది విద్యార్థులు మంగళవారం సెలవుదినం కావడంతో సరదాగా కన్యాకుమారి బీచ్‌కి వెళ్లారు. వీరిలో భద్రాద్రి జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు ఉన్నారు. వారిలో సుజాతనగర్‌క చెందిన ఒకరికి జ్వరం రావడంతో అతను బీచ్‌లో స్నానానికి వెళ్లకుండా ఫోటోలు తీస్తున్నాడు. సరదాగా నీటిలోకి దిగిన వారిలో పాల్వంచకు చెందిన బత్తినేని సురేష్, శ్రీలక్ష్మీ దంపతుల ఒక్కగాని ఒక్క కుమారుడు బత్తినేని జయంత్‌సాయి(18) రాకాసి అలల్లో చిక్కుకుని మరణించగా, సుజాతనగర్‌కు చెందిన మండవ సురేష్, శ్రీలత దంపతుల ఒక్కగాని ఒక్క కుమారుడు మండవ సాయి తరుణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కన్యాకుమారిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇతనికి చికిత్స చేస్తున్నట్లు సమాచారం. మండవ సాయి తరుణ్ పరిస్థితి విషమంగా ఉందన్న సమాచారంతో సుజాతనగర్‌లోని విద్యార్థుల ఇళ్లవద్ద బంధువులు ఆందోళనలో ఉన్నారు.


జయంత్‌సాయి మృతదేహం

వినాయక సెలవిక..




కొత్తగూడెంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు, శోభయాత్ర


ఇల్లెందులో గణేషుడి శోభయాత్ర

యువకుడిపై దాడి: కేసు నమోదు

చుంచుపల్లి, సెప్టెంబరు 17: చుంచుపల్లి మండలంలోని రామాంజనేయకాలనీ పంచాయతీలో యువకుడు కుంచం రమేష్‌పై మంగళవారం ఆరుగురు యువకులు దాడి చేశారు. సోమవారం రాత్రి గణేష్ నిమజ్జనం జరుగుతున్న క్రమంలో నృత్యాలు చేసేందుకు బాధితుడు, వారి బృందం వెళ్లగా అక్కడ ఉన్న కొంత మంది యువకులు వెళ్ళిపొమ్మని హెచ్చరించారు. ఈ క్రమంలో బాధితుడు రమేష్‌ను అక్కడ ఉన్న ఆరుగురు యువకులు విచక్షణ రహితంగా దాడి చేశారు. ఈ సంఘటనపై చుంచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాజీవ్ విగ్రహ ఏర్పాటుపై బీఆర్ఎస్ ఆందోళనలు

మణుగూరు/అశ్వారావుపేట/ఇల్లెందు, సెప్టెంబరు 17: రాష్ట్రంలో దుర్మార్గ పాలన సాగుతోంది.. ప్రజలు తెలుసుకోవాలి.. తెలంగాణ తల్లిని అవమాన పరిచే చర్యలకు ప్రభుత్వం పూనుకుంటుంది.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో తెలంగాణ తల్లివిగ్రహం పెట్టే చోట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టడం సరికాదు.. ప్రజలు గమనిస్తున్నారు. ఆత్మభిమానాలను దెబ్బతీసే చర్యలను ఊరుకోరంటూ పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు. మంగళవారం మణుగూరులోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు మోటర్ సైకిల్ ర్యాలీతో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కు చేరుకుని ఆందోళన సాగించారు. రేగా మాట్లాడుతూ.. ప్రజలను మోసగించి మాయచేసి, మభ్య పెట్టే పాలన సాగుతోందని ఆరోపించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకాన్ని నిర్వహించి పూల మాలలు వేసి జై తెలంగాణ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

అశ్వారావుపేట: సచివాలయంలో ప్రభుత్వం రాహుల్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం అశ్వారావుపేట రింగ్‌రోడ్డు సెంటర్‌లోని తెలంగాణతల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేసి నిరసన నినాదాలిచ్చారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణ అస్థిత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో యుఎస్ ప్రకాశరరావు, సంపూర్ణ, తాళం సూరిబాబు, రఘురామ్, రాంబాబు, జుజ్జూరు వెంకన్న, మోహన్, పణీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఇల్లెందులో నిరసన వ్యక్తంచేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇల్లెందు: పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవంగా జరుపుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ. బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి జగదాంబ సెంటర్‌లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ డిల్లీ గులాముల పాలన సాగుతుందని. తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేని వారి పాలనలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నీలివెరు సత్య నారాయణ. దెవి లాల్. బావు సింగ్. మునిసిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.. అదే విధంగా సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహ ఆవిష్కరణను నిరసిస్తూ తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

క్రీడల్లోనూ రాణించాలి: ఎమ్మెల్యే పాయం

పినపాక, సెప్టెంబరు 17: విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ధృడంగా తయారవ్వాలంటే చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జానంపేట గ్రామంలోని జడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీల ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. క్రీడా జ్యోతి వెలిగించి, జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యే పాయం క్రీడలకు విద్యార్థులు ఇవ్వాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వాలీబాల్ క్రీడలను సర్వీస్ చేసి, లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పాఠశాలల క్రీడల కన్వీనర్ కే విజయలక్ష్మీ, ఎంఈఓ వి వీరాస్వామి, ఏడూళ్లబయ్యారం సీఐ వి వెంకటేశ్వరరావు, మండల నోడల్ ఆఫీసర్ కే నాగయ్య, పినపాక హెచ్‌ఎం కే రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే రాములమ్మ, పీడీలు కే ఆదినారాయణ, పి అనిల్‌కుమార్, పి వీరన్న, ఈ బాలరాజు, పిఈటీలు పాల్గొన్నారు. అనంతరం 'నాటుదాం ఒక మొక్క అమ్మ పేరుతో' అనే కార్యక్రమాన్ని మంగళవారం జానంపేట పాఠశాలలో ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం జానంపేట ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి రోగులతో, గర్భిణులతో ఆయన మాట్లాడారు. వసతులు, అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై వైద్యురాలు శృతిని అడిగి తెలుసుకున్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే పాయం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మండలంలోని పలువురు లబ్ధిదారులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రూ, 5.80 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పాండురంగాపురానికి చెందిన కొర్సా నరేష్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కరకగూడెం, సెప్టెంబర్ 17: మండలంలోని అశ్వాపురం వలస ఆదివాసీ గ్రామానికి చెందిన కొవ్వాసి సురేష్ (37) అనే వ్యక్తి మంగళవారం పురుగుల మందు తాగి మృతిచెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. మంగళవారం సురేష్ అనే వ్యక్తి తన పొలం వద్దకు వెళ్ళాడు అక్కడే పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.